
సాక్షి నంద్యాల

సోమవారం ၊ 18 ၊ మార్చి ၊ 2024



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ప్రకాశం జిల్లాకు చెందిన ఎన్. మురళి కృష్ణ రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం కేసీ కాల్వకు ఆదివారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:32	ఉ॥ 5:00
ఆదోని	సా॥ 6:35	ఉ॥ 5:03
నంద్యాల	సా॥ 6:32	ఉ॥ 4:57
ఆత్మకూరు	సా॥ 6:30	ఉ॥ 4:58
బనగానపల్లె	సా॥ 6:33	ఉ॥ 4:58

హదీస్ వెలుగు :

యుద్ధంలో ప్రత్యర్థుల ఆయుధాల నుంచి కాపాడేందుకు కవచం ఉపయోగపడినట్లు పాపాల నుంచి మనిషిని రంజాన్ ఉపవాస దీక్ష కాపాడుతుంది. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

జగజ్జననీ మాతకు క్షీరాభిషేకం



అమ్మవారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక జగజ్జననీనగర్‌లో వెలసిన జగజ్జననీ ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో రెండో రోజు ఆదివారం సహస్రకలశ క్షీరాభిషేకం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గణ పతిపూజ, పుణ్యాహవాచనం, ప్రవేశం, కలశ స్థాపన, పూజలు నిర్వహించి అమ్మవారి మూల విరాట్‌కు మహిళలు ఇంటి వద్ద నుంచి కళశాలలో తీసుకొని వచ్చిన పాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థం ప్రసాదలను అందజేశారు. సోమవారం సహస్ర కుంకుమార్చన, మంగళవారం శ్రీచక్రార్చన, బుధవారం చండీ హోమం, పుణ్యాహవాచన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు ఆలయ నిర్వాహకులు పుల్లయ్య తెలిపారు.

ప్రశాంతంగా గ్రూప్‌- 1 పరీక్ష



ఆర్జీఎం కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో గ్రూప్‌- 1 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో ఏడు కేంద్రాలలో నిర్వహించిన పరీక్షకు 3,675 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 2,302 మంది హాజరయ్యారు. 1,373 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. నంద్యాల పట్టణం శ్రీనివాస సెంటర్‌లోని నేషనల్ డిగ్రీ కాలేజీలోని పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నంద్యాల పట్టణం ఎన్‌జీఓస్ కాలనీ లలితానగర్‌లోని గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. ఏడుగురు లైజన్ ఆఫీసర్ల (సీనియర్ జిల్లా స్థాయి అధికారులు)ను, మరో ఏడుగురు చీఫ్ సూపరింటెండెంట్‌లు పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

మండుతున్న ఎండలు

కర్నూలు(అగ్రికల్చర్): భానుడు భగభగమంటున్నాడు. కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న వేళ కర్నూలులో జిల్లా యంత్రాంగం నెలకొల్పిన చలువ పందిళ్లు ఉపశమనాన్ని ఇస్తున్నాయి. ఆదివారం కోసిగిలో 41.2, హొళగొందలో 41.09, మంత్రాలయంలో 40.91, కొతాళంలో 40.2, ఆత్మకూరులో 41.38, బండిఆత్మకూరులో 41.29, చాగలమర్రిలో 40.97, బనగానపల్లెలో 40.87, మహానందిలో 40.37 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఎలక్షన్‌.. అటెన్షన్‌!

- ఎన్నికల షెడ్యూల్ విడుదలతో కోడ్ అమలులోకి
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ప్రతి నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారి నియామకం
- ప్రలోభాలను అడ్డుకునేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్‌ల తనిఖీలు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: సార్వత్రిక ఎన్నికలకు నగారా మోగడంతో అధికారులు ఎన్నికల ప్రక్రియను షురూ చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి శనివారం నుంచే అమలు కావడంతో అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల అధికారులు ముందుకెళ్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు అధికారులకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వసతుల కల్పన, సిబ్బంది నియామకం తదితరాలపై కసరత్తు పూర్తి చేశారు. నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ, బనగానపల్లె, నంద్యాల, పాణ్యం, నందికొట్కూరు, శ్రీశైలం, డోన్ నియోజకవర్గాల్లో 13,72,091 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుష ఓటర్లు 6,73,425 మంది ఉండగా మహిళా ఓటర్లు 6,98,404 మంది, ఇతరులు 262 మంది ఉన్నారు. జిల్లాలో 1,706 పోలింగ్ కేంద్రాలు గుర్తించారు. ఇందులో 93 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఓటింగ్ ప్రక్రియకు సంబంధించి నంద్యాల పార్లమెంట్‌కు చెందిన 2,030 కంట్రోల్ యూనిట్లు, 2,509 బ్యాలెట్ యూనిట్లు, 2,452 వీవీ ప్యాట్లు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన 1,924 కంట్రోల్ యూనిట్లు, 2,520 బ్యాలెట్ యూనిట్లు, 2,451 వీవీ ప్యాట్లను ఏర్పాటు చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు..

అలాగే ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్‌లోని డీపీఆర్‌ఓ కార్యాలయంలో ఐదు విభాగాలకు సంబంధించి కంట్రోల్ విభాగాలను ఏర్పాటు చేశారు. మీడియాసెల్, ఫిర్యాదులు, నిర్వహణ విభాగం, సీ-విజిల్‌టీం, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ విభాగాలు 24 గంటలు పని చేయనున్నాయి. ప్రజలకు సమాచారం, ఫిర్యాదులు, ఇతర అవసరాల కోసం టోల్‌ఫ్రీ నంబరును ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. అలాగే మరికొన్ని నంబర్లను కూడా అందుబాటులో ఉంచనున్నారు.

ప్రతి నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారి

శాసన సభ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ప్రతి నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిని నియమించారు. రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపులు, అభ్యర్థుల తుదిజాబితా వీరే తయారు చేస్తారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వంటివి ఆర్వోల పర్యవేక్షణలో జరగనున్నాయి.

నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు

నియోజకవర్గం	ఆర్వో పేరు	ప్రస్తుతం పని చేస్తున్న స్థానం
నంద్యాల	రాహుల్‌కుమార్‌రెడ్డి	జేసీ, నంద్యాల
ఆళ్లగడ్డ	మల్లికార్జునరెడ్డి	ఆర్‌డీఓ, నంద్యాల
నందికొట్కూరు	మిరియాల దాసు	ఆర్‌డీఓ, ఆత్మకూరు
డోన్	మహేశ్వరరెడ్డి	ఆర్‌డీఓ, డోన్
బనగానపల్లె	కామేశ్వరరావు	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఎస్సార్బీసీ, నంద్యాల
శ్రీశైలం	సుధారాణి	రైల్వే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నంద్యాల

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల నియామకం..

మూడు నాలుగు మండలాలకు అధికారులతో కలసి ఒక ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు. వీరు ఆ పరిధిలో మద్యం, డబ్బు, ప్రలోభ పరిచేందుకు తరలించే సామగ్రి అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు చేస్తారు. ఈ మేరకు జిల్లా పరిధిలో 10 చెక్‌పోస్టులు ఉండగా, బ్రాహ్మణ కొట్కూరు వద్ద, సున్నిపెంట సమీపంలోని లింగాల గట్టు వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, జిల్లాలో మరో 8 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన మొదటి రోజే శనివారం నందికొట్కూరు వద్ద బొలేరో వాహనంలో తరలిస్తున్న రూ.10.85 లక్షల నగదును సీజ్ చేసి ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు విచారణ నిమిత్తం అప్పగించారు.



గాజులపల్లె చెక్‌పోస్టు వద్ద వాహనాల తనఖీ చేస్తున్న పోలీసులు

ఎన్నికల నియమావళిని తప్పక అమలు చేయండి

సాధారణ ఎన్నికల షెడ్యూల్ వెలువరించిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండెక్ట్)ను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు రిటర్నింగ్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లను ఆదేశించారు. ఆదివారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుపై జిల్లా ఎన్నికల అధికారులు తీసుకుంటున్న చర్యలపై రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ ఎ. పద్మజ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్ట్ (ఎంసీసీ) అమలును పటిష్టంగా అమలు చేయాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సంబంధిత అధికారులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సీ-విజిల్ యాప్‌కు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని మరింత బలోపేతం చేసి యాప్ నుంచి వచ్చే ఫిర్యాదులకు 100 నిమిషాల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ టీంలు పర్యటించేందుకు సోమవారం ఉదయంలోగా వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామ పంచాయతీలు, సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఫొటోలను, ఇతర క్యాలెండర్లు, జెండాలను, బస్టాండ్, రైల్వే స్టేషన్లలో, రోడ్డు కిరువైపులా, ముఖ్య కూడలి ప్రాంతాల్లోని అన్ని హోర్డింగులను రిటర్నింగ్ అధికారులు, సంబంధిత ఏఆర్వోలు, ఎంపీడీఓలతో మాట్లాడి తక్షణమే తొలగించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎస్పీడీసీఎల్, ఎగ్జిక్యూటివ్ ఆన్ గోయింగ్ వర్కులు మినహా కొత్త పనులు ఏవి చేపట్టవద్దన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల జాబితాను సోమవారం సాయంత్రం లోగా అందజేయాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు



బేతంచెర్ల పట్టణంలో రాజకీయ నాయకుడి విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం



నంద్యాలలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

బ్యానర్లు, ఫొటోలు తొలగింపు..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ఎన్నికల షెడ్యూలు ప్రకటించినప్పటి నుంచి 24 గంటల్లో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లోనూ, 48 గంటల్లో ప్రైవేటు వ్యక్తుల స్థలాల్లోనూ అనుమతి లేకుండా ఉన్న రాజకీయ ప్రకటనలను తొలగించాల్సి ఉంది. ఈ మేరకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా రాజకీయ పార్టీల ప్రచారం బ్యానర్లు, కటౌట్లు, వాల్‌పోస్టర్లు, ఫొటోల తొలగింపు, రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు వస్త్రం కప్పి ఉంచడం తదితర పనులన్నింటినీ నిర్ణీత గడువు లోగా పూర్తి చేస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు ఆగమేఘాలపై శనివారం రాత్రి నుంచే తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

అభివృద్ధిని ఓర్వలేకనే విమర్శలు



మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన ముస్లిం నాయకులు



సభకు హాజరైన ముస్లింలు

- కోట్ల, కేఈ కుటుంబాల స్వార్థ రాజకీయాలను ప్రజలు నమ్మరు
- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లిం కుటుంబాలు

డోన్ టౌన్: ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డోన్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు అబ్దుల్ రెహమాన్ ఖాన్, అక్బర్ ఆధ్వర్యంలో దాదాపు 500 మంది టీడీపీని వీడి మంత్రి సమక్షంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కౌన్సిలర్ షాదిక్, మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్యాల శ్రీనివాసరెడ్డి సహకారంతో పట్టణంలోని 11 మజీద్‌లకు చెందిన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ముస్లిం కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. టీడీపీకి చెందిన ప్రముఖ లార్క్ కుటుంబ సభ్యులు రహీంఖాన్, రియాజ్‌ఖాన్, సిరాజ్‌ఖాన్, పహాద్‌అలీఖాన్, షాభీర్‌తో పాటు అక్బర్, ఫారూక్, అన్వర్, సిబకతుల్లా ఆసీఫ్‌సాబ్, అబ్దుల్లా, ముబారక్, మౌలాలీ, షేక్షా, జాకీర్, శేతు, షఫీ, అజీమ్, చిన్నచాంద్, పెద్దచాంద్, మహ్మద్‌తో పాటు దాదాపు 500 ముస్లిం కుటుంబాల సభ్యులకు మంత్రి బుగ్గన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ల అమలు చేయడంతో తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని డోన్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుపుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమి కమిటీ చైర్మన్ నదీమ్, డైరెక్టర్ ముర్తూజావలి, రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ముస్లిం మైనార్టీలు, నాయకులతో పాటు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వారిని ప్రజలు చీదరించుకుంటున్నారు

కోట్ల, కేఈ కుటుంబాలు కలసిపోవడాన్ని ప్రజలు చీదరించుకుంటున్నారని మంత్రి బుగ్గన విమర్శించారు. కార్యక్రమానికి ముందుగా మంత్రి రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలను దీక్ష విరమింపజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ గతంలో కోట్ల, కేఈ కుటుంబాల ఫ్యాక్షన్‌కు ఎంతో మంది అమాయకులు బలయ్యారన్నారు. ప్రస్తుతం రాజకీయ ఉనికి కోసం రెండు కుటుంబాలు స్వార్థ రాజకీయాలకు పాల్పడుతున్నాయన్నారు. అప్పట్లో అనేక పదవులు అలంకరించిన ఈ రెండు కుటుంబాలు డోన్‌కు ఏమి చేయలేక పోయాయన్నారు. 40 ఏళ్లలో వారు చేయలేని అభివృద్ధిని ఐదేళ్లలో తాము చేసి చూపించామన్నారు. గతంలో ఏమి చేయలేని నాయకులు ఇప్పుడు ఏదో చేస్తారని చెబితే ప్రజలు ఎలా నమ్ముతారన్నారు. వైఎస్సార్‌సీపీ బరిలోకి దిగిందని, ప్రత్యర్థులు ఎవరైనా ఆట ఆడేందుకు సిద్ధమన్నారు.

దేవతలారా రారండి..

- సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజపటావిష్కరణ
- సింహ వాహనంపై ఊరేగిన ప్రహ్లాదవరదుడు
- సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చిన జ్వాలా నరసింహుడు

ఆళ్లగడ్డ: అహోబిలేశుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం దిగువ అహోబిలంలో ధ్వజారోహణ పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం అహోబిల మఠం పీఠాధిపతి శ్రీరంగరాజ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతా మూర్తులను ఆహ్వానిస్తూ ధ్వజ స్తంభంపై గరుత్మంతుని చిత్రపటావిష్కరణ చేశారు. అంతకుముందు దిగువ అహోబిలం దేవాలయం ఆవరణ నుంచి ప్రత్యేకంగా అలంకరించిన గరుత్మంతుని చిత్రపటాన్ని పల్లకీలో కొలువుంచి ప్రదక్షిణ చేయిస్తూ ఊరేగింపుగా ఆలయం ఎదురుగా ఉన్న ధ్వజ స్తంభం వద్దకు తీసుకువచ్చారు. అలాగే ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములతో పాటు మొదటి జీయర్ శ్రీ ఆదివన్ శఠగోపన్ ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో తీసుకొచ్చారు. అక్కడ శ్రీ ప్రహ్లాదవరదుని బ్రహ్మోత్సవాలకు సకల దేవతామూర్తులు తరలిరావాలని ఆహ్వానిస్తూ ధ్వజారోహణం చేసి మంత్ర పూర్వకంగా పిలుపునిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన ప్రహ్లాదవరదుడి కల్యాణ మహోత్సవం ఈనెల 23వ తేదీన జరగనుంది. ఈ మహోత్సవానికి ముక్కోటి దేవతలు కదలి వచ్చి, విందారగించి స్వామి అమ్మవార్లను ఆశీర్వదిస్తారని తద్వార లోక కల్యాణం నిర్వహించినట్లు అవుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా భేరీ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం కొలువుంచారు. రాత్రి ప్రహ్లాదవరదుడు సింహ వాహనంపై కొలువై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తజనులను అనుగ్రహించారు. పూజల్లో ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాయన్, జీపీఏ సంపత్, ఓఎస్‌డి శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఎగువ అహోబిలంలో..

అహోబిల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోవ రోజు ఆదివారం ఎగువ అహోబిలంలో శ్రీ జ్వాలా నరసింహ స్వామికి రెండు వాహన సేవలు నిర్వహించారు. ముందుగా హంస వాహనంపై కొలువైన స్వామి వారు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి సూర్యప్రభ వాహనంపై జ్వాలా నరసింహుడు విహరించారు. ముందుగా నిత్య పూజలు అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జ్వాల నరసింహులను యాగశాలలో కొలువుంచి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వివిధ పుష్పాలంకరణ గావించిన తర్వాత వాహన సేవలను వైభవంగా నిర్వహించారు.



ప్రత్యేకాలంకరణలో ఉభయ దేవేరులతో కొలువైన ప్రహ్లాదవరదుడు



శాస్త్రోక్తంగా ధ్వజపటావిష్కరణ చేస్తున్న అర్చకులు

నేటి కార్యక్రమాలు..

ఎగువ అహోబిలంలో సోమవారం ఉదయం ఉత్సవం, మధ్యాహ్నం అభిషేకం, రాత్రి హనుమంత వాహన సేవలు ఉంటాయి. దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదస్వామికి ఉదయం హంసవాహన, రాత్రి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించనున్నారు.



ఎగువ అహోబిలంలో హంస వాహనంపై ఊరేగుతున్న జ్వాలా నరసింహుడు

విజయీభవ!

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- జిల్లాలో 134 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- పరీక్ష రాయనున్న 30,242 మంది విద్యార్థులు
- హాల్‌టికెట్ చూపితే బస్సుల్లో ఉచిత ప్రయాణం



నంద్యాల పరీక్ష కేంద్రంలో బెంచీలపై హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

నంద్యాల(న్యూటౌన్): ఇప్పటి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టిన పదో తరగతి విద్యార్థులు నేటి (సోమవారం) నుంచి పరీక్షలు రాయబోతున్నారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇందుకు అధికారులు 134 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఏ కేటగిరీ సెంటర్లు (పోలీసు స్టేషన్లకు దగ్గర ఉండేవి) 62, బీ సెంటర్లు (పోలీసు స్టేషన్లకు 8కి.మీ లోపు ఉండేవి) 57, సీ సెంటర్లు (పోలీసు స్టేషన్లకు 8 కి.మీకు పైగా ఉన్నవి)15 ఉన్నాయి. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు 134 మంది, ఏడీఓలు 32, ఇన్విజిలేటర్స్ 1,750 మంది, స్క్వాడ్స్ 5, సీ-కార్ కస్టోడియన్ 12ని నియమించారు. నంద్యాల జిల్లా పదవ తరగతి పరీక్షలకు అబ్జర్వర్‌గా ఆర్ఎస్ గంగాభవానీని ప్రభుత్వం నియమించినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించి అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. పరీక్షల విధుల్లో ఉన్నవారు మినహా బయటి వ్యక్తులను కేంద్రాల్లోకి అనుమతించరు. దివ్యాంగులకు అవసరమైతే స్క్రయిబ్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో హాల్‌టికెట్ చూపి ఉచితంగా ప్రయాణం చేయవచ్చు.

20 కేంద్రాల్లో ఓపెన్ పరీక్షలు

ఓపెన్ స్కూల్ పరీక్షలకు జిల్లాలో 20 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ పరీక్షలు జరునున్నాయి. పది పరీక్షలకు 09, ఇంటర్ థియరీ పరీక్షలకు 9 కేంద్రాలు, ప్రాక్టికల్ పరీక్షలకు 2 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పది పరీక్షలకు 1,514 మంది, ఇంటర్ పరీక్షలకు 1,518 మంది, ప్రాక్టికల్ పరీక్షలకు 260 మంది హాజరుకానున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరగనున్నాయి.

పరీక్షలకు పదండిలా..!

పదవ తరగతి విద్యార్థులు తొలిసారిగా పబ్లిక్ పరీక్షలకు హాజరుకానుండటంతో ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్ష సమయానికి అర గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి. ఉదయం 8.45 గంటలకు కేంద్రాల్లోకి అనుమతించాక కేటాయించిన స్థానాల్లోనే కూర్చోవాలి.

- అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు వెంట తెచ్చుకోవాలి.
- పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్లకూడదు.
- ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే ఇన్విజిలేటర్‌ను సంప్రదించాలి.
- స్కూల్ యూనిఫాం వేసుకుని రాకూడదు.
- ప్రశ్నపత్రం క్షుణ్ణంగా చదివిన తరువాత ముందుగా తెలిసిన వాటికి సమాధానాలు రాయాలి.
- ఎలాంటి కొట్టివేతలు లేకుండా సమాధానాలు స్పష్టంగా రాయాలి.
- ఉదయం 9.30 గంటల వరకు పరీక్ష ప్రారంభమైన తర్వాత మధ్యాహ్నం 12.45 గంటల పరీక్ష ముగిసే వరకు బయటకు వెళ్లనివ్వరు.

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్య


మృతి చెందిన సునీత

ఓర్వకల్లు: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన పెరుమాళ్ల మురళీమోహన్ భార్య పెరుమాళ్ల సునీత(34) గత కొంత కాలంగా గుండె నొప్పితో బాధపడేది. ఎంత మంది వైద్యుల వద్ద చూపించినా ఫలితం లభించలేదు. దీంతో ఈ నెల 16వ తేదీన జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవ్వరులేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కోలుకోలేక ఆదివారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి భర్త మురళీమోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

కర్నూలు (టౌన్): ఓర్వకల్లు మండలం గుమితం తండా వద్ద నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 3 వేల 200 లీటర్ల బెల్లపు ఊట, 35 లీటర్ల నాటుసారాను సెబ్‌పోలీసులు ధ్వంసం చేశారు. సమాచారం మేరకు ఆదివారం నాటుసారా స్థావరంపై దాడి చేశారు. ఎవరైనా అక్రమంగా మద్యం రవాణా చేసినా, సారా తయారు చేసి విక్రయించినా కఠిన చర్యలు తప్పవని సెబ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు గ్రామంలో ఆదివారం ఓ వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన బాబు బెల్ట్ షాపుద్వారా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో దాడి చేశామనాన్నరు. అతని నుంచి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు 'ఎడెక్స్'

- ఉన్నత విద్యలో నూతన అధ్యాయానికి శ్రీకారం
- ఆన్‌లైన్ కోర్సుల సంస్థ ఎడెక్స్‌తో ఒప్పందం
- అందుబాటులోకి ఉచితంగా 2000కు పైగా వరల్డ్ క్లాసు కోర్సులు
- లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డ్, ఎంటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి వర్సిటీల నుంచి సర్టిఫికెట్లు
- విద్యార్థికి వీలున్న సమయంలోనే కోర్సు పూర్తి చేసే వెసులుబాటు
- రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 8 వేల మంది విద్యార్థులకు అవకాశం



రాయలసీమ విశ్వవిద్యాలయం ముఖ ద్వారం

కర్నూలు కల్చరల్: విదేశాలకు వెళ్లి చదువుకోలేని పేద, మధ్య తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సువర్ణావకాశం కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అంతర్జాతీయ వర్సిటీల కోర్సులను ఉచితంగా అందించే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రముఖ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో ఒప్పందం చేసుకుంది. దీంతో ఈ సువర్ణ అవకాశం రాయలసీమ విశ్వ విద్యాలయం, అనుబంధ యూజీ, పీజీ కళాశాల విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఎడెక్స్, ఉన్నత విద్యా శాఖ సంయుక్తంగా టీచింగ్, లెర్నింగ్ కోసం కొత్త టెక్నాలజీ, బోధన విధానాలను రూపకల్పన చేశాయి. హార్వర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, కొలంబియా, న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్స్, ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్ వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక వర్సిటీల నుంచి వివిధ కోర్సుల్లో విద్యార్థులు సర్టిఫికేషన్లు సులువుగా పొందవచ్చు. ఈ కోర్సు పూర్తి చేయడం ద్వారా మంచి వేతనాలతో కూడిన జాతీయ, అంతర్జాతీయ ఉద్యోగాలను సాధించేందుకు దోహదం కానుంది.

8 వేల మందికి లబ్ధి

రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో మొత్తం 8,110 మంది విద్యార్థులకు ఎడెక్స్ లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే విద్యార్థుల వివరాలను ఉన్నత విద్యా మండలికి అధికారులు నివేదించారు. వరల్డ్ క్లాస్ వర్సిటీలు, ఇతర విద్యా సంస్థలు అందించే రెండు వేలకు పైగా ఎడెక్స్ ఆన్‌లైన్ కోర్సులను, రెగ్యులర్ కోర్సులతో పాటు ఉచితంగా అభ్యసించవచ్చు. అనంతరం ఎడెక్స్, అంతర్జాతీయ వర్సిటీల నుంచి సర్టిఫికెట్లు అందుకోవచ్చు. ప్రపంచంలోనే అత్యున్నత స్థాయి విశ్వవిద్యాలయాలు, సంస్థలకు చెందిన అత్యుత్తమ అధ్యాపకులతో బోధన లభిస్తుంది. శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు సామాజిక, సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన వివిధ సబ్జెక్టులను పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చారు.

నచ్చిన వర్టికల్స్ చదువుకునేలా

ఎడెక్స్ కోర్సుల్లో ఎక్కువ వర్టికల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. తద్వారా విద్యార్థి నచ్చిన వర్టికల్స్ చదువుకునేలా ప్రణాళిక రూపొందించారు. విదేశాలకు వెళ్లి అక్కడ మేటి కళాశాలల్లో చదువుకోలేని ఎంతో మంది విద్యార్థులకు ఈ విధానం ద్వారా ఎంతో మేలు చేకూరనుంది. కరిక్యులమ్‌లో భాగంగా ఎడెక్స్ కోర్సులకు అంతర్జాతీయ వర్సిటీలే ఆన్‌లైన్‌లో ఎగ్జామ్స్ నిర్వహించి సర్టిఫికెట్లు అందిస్తాయి. తద్వారా ఏపీ విద్యార్థులు గ్లోబల్ స్టూడెంట్స్‌గా ఎదుగుతారు. ప్రొఫెషనల్, సంప్రదాయ డిగ్రీ విద్యలో లోటుపాట్లను సరిచేసి స్కిల్ ఓరియంటెడ్ కోర్సులను అందించడం ద్వారా నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధిలో ఎడెక్స్ ఎంతో ఉపయోగపడనుంది.

ఎడెక్స్‌లో నమోదు చేసుకున్న విద్యార్థుల వివరాలు..

కళాశాల	విద్యార్థుల సంఖ్య
నంద్యాల నేషనల్ కళాశాల	617
నంద్యాల శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల	594
కేవీ సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల	471
నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల	440
ఆదోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాల	370
రాయలసీమ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల	332
కర్నూలు శ్రీ శంకరాస్ డిగ్రీ కళాశాల	330
ప్రజ్ఞడిగ్రీ కళాశాల	319

రూ.30 వేల విలువైన కోర్సు ఉచితంగా...

ప్రపంచంలోనే ప్రముఖ ఈ–లెర్నింగ్ ప్లాట్‌ఫాం వేదికగా ఉన్న ఎడెక్స్‌లో 180కి పైగా వరల్డ్ క్లాస్ వర్సిటీలు రూపకల్పన చేసిన 2 వేల ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క కోర్సు చేయాలన్నా కనీసం రూ.30 వేలు ఖర్చు భరించాల్సి ఉంది. అయితే ఈ కోర్సులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఉచితంగా అందిస్తోంది. డిగ్రీ సెమిస్టర్‌లో ఆరు సబ్జెక్టులు ఉంటే ఒకటి ఎడెక్స్ కోర్సుతో భర్తీ చేస్తారు. అంతర్జాతీయ వర్సిటీలతో కలసి విద్యార్థి అసైన్‌మెంట్స్, ప్రతిభ ఆధారంగా ఎడెక్స్ సంస్థ సర్టిఫికెట్ అందిస్తుంది. రాత పరీక్షను ఎడెక్స్ రూపొందించిన ప్రశ్నపత్రంతో వర్సిటీలే నిర్వహిస్తాయి. క్రెడిట్స్ కూడా వర్సిటీలే ఇస్తాయి. ఆసక్తి గల విద్యార్థులు ఒకటి కంటే ఎక్కువ కోర్సులు చేయవచ్చు. వాటిని వాల్యూ యాడెడ్ కోర్సులుగా పరిగణించి సర్టిఫికెట్ ఇస్తారు.

ఉన్నత విద్యలో నూతన అధ్యాయం



ఏపీ ఉన్నత విద్యలో ఎడెక్స్ సంస్థతో ఒప్పందంతో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్లైంది. మన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడి మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. నాణ్యమైన విద్య ద్వారానే ఇది సాధ్యం అవుతుంది. ప్రైవేట్ సంస్థల్లో శిక్షణ పొందాలంటే రూ.30 వేల వరకు చెల్లించాల్సిన కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగానే అందిస్తోంది. ఇది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుంది.

– ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్, వైస్‌ఛాన్స్‌లర్, ఆర్‌యూ

ఎడెక్స్ కోర్సు ఇలా...

డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థులు తప్పనిసరిగా ఎడెక్స్ కోర్సులు అభ్యసించేలా కరిక్యులమ్‌లో ఓ భాగంగా మార్చేశారు. డిగ్రీ, పీజీ స్థాయిలో రెండు, నాలుగో సెమిస్టర్, ఇంజినీరింగ్ స్థాయిలో రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్‌లో ప్రతి విద్యార్థి వర్సిటీ లేదా కళాశాల ఎంపిక చేసిన ఎడెక్స్ కోర్సులను పూర్తి చేయాల్సి ఉంటుంది. విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా ఎడెక్స్ అందించే అంతర్జాతీయ కోర్సులను అభ్యసించేందుకు అవకాశం ఉంది. ఈ ఆన్‌లైన్ కోర్సులను విద్యార్థులకు వీలున్న సమయంలో పూర్తి చేసే వెసులుబాటు ఉంది. వారానికి నాలుగు గంటల పాటు క్లాసులు ఉంటాయి. ప్రతి విద్యార్థి ప్రత్యేక లాగిన్ ద్వారా మొబైల్ యాప్‌లో పాఠాలు వినవచ్చు. సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఆన్‌లైన్ సపోర్టింగ్ సిస్టమ్‌లో 279 మంది మెంటార్లు అందుబాటులో ఉంటారు.

కరువు రైతుకు ఊరట

- రబీ కరువు మండలాలను గుర్తించిన ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 31 మండలాల గుర్తింపు

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఊరట కలిగించే మరో నిర్ణయం తీసుకుంది. 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రకటించిన కరువు మండలాలకు ఇటీవలనే ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాల్లో 3,75,244 మంది రైతులకు రూ.460.47 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేసింది. తాజాగా 2023–24 రబీ సీజన్‌కు సంబంధించి కూడా కరువు మండలాలను ప్రకటించింది. ఖరీఫ్ వర్షాభావం రబీలో కూడా కొనసాగింది. వేసిన పంటలు దెబ్బతినగా.. భూమిలో తేమ లేకపోవడం వల్ల చాలా వరకు భూముల్లో విత్తనం కూడా పడలేదు. రబీ కరువు పరిస్థితిపై ఇటీవలనే జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక పంపింది. ఈ మేరకు ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 31 మండలాలకు కరువు ప్రాంతాలుగా గుర్తించింది. కర్నూలు జిల్లాలో కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, కోడుమూరు, కల్లూరు, ఓర్వకల్లు, గూడూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు, చిప్పగిరి, ఆస్పరి, హొళగుంద, హాలహర్వి, పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, వెల్దుర్తి, సి.బెళగల్ మండలాలు, నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ, గోస్పాడు, గడివేముల, బనగానపల్లె, ఉయ్యాలవాడ, సంజామల, అవుకు, నందికొట్కూరు, మిడుతూరు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, దొర్నిపాడు, నంద్యాల మండలాలు కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది.

విద్యార్థులకు ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని షెడ్యూల్డు కులాలు, ఇతర వెనుకబడిన వర్గాలకు చెందిన 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలను మంజూరు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జే రంగలక్ష్మీదేవి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మ్యాన్యువల్ స్కావెంజర్స్ అయిన టాన్నర్స్ అండ్ ఫ్లేయర్స్, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు ఏడాదికి రూ.3 వేలు, వసతి గృహాల్లో ఉండే పిల్లలకు ఏడాదికి రూ.8 వేలు ఉపకార వేతనాలను మంజూరు చేస్తామన్నారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను ఏప్రిల్ 4వ తేదీలోగా ఆన్‌లైన్ చేసి సంబంధిత కాపీలను తమ పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో అందించాలని జేడీ కోరారు.

అంతర్ విశ్వవిద్యాలయాల సెపక్‌తక్రా పోటీలు



సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, విజయం సాధించిన రాయలసీమ విశ్వవిద్యాలయం జట్టు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆల్‌ఇండియా అంతర్ విశ్వ విద్యాలయాల సెపక్‌తక్రా క్రీడా పోటీలను ఆదివారం నిర్వహించారు. కళాశాల మాజీ కరస్పాండెంట్ విశ్వనాథరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని, పోటీలను ప్రారంభించారు. రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్‌కుమార్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. పోటీల్లో 24 జట్లు పాల్గొన్నాయన్నారు. శ్రీకాకుళం వర్సిటీ జట్టుపై రాయలసీమ విశ్వవిద్యాలయం జట్టు విజయం సాధించిందని తెలిపారు. జై నారాయణ వ్యస్ విశ్వ విద్యాలయంపై కొచ్చిన్ విశ్వవిద్యాలయం, జైపూర్ నిర్వాణ విశ్వవిద్యాలయంపై యూనివర్సిటీ అఫ్ కలికట్, మాధవ్ యూనివర్సిటీ పింద్వరాపై మౌలానా అజాద్ జోడాపూర్ విశ్వవిద్యాలయం జట్టు విజయం సాధించిందన్నారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ విట్టా సతీష్, వైస్ చైర్మన్ డాక్టర్. విజయలక్ష్మీ, కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి, మాజీ కరస్పాండెంట్లు శ్రీనివాసరెడ్డి, తిమ్మారెడ్డి, సనత్ కుమార్ ప్రిన్సిపాల్ మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పద్మావతినగర్ స్టేడియంలో ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు సీనియర్ రెజ్లింగ్ బాలురు, బాలికలు, అండర్–20 ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సెక్రటరీ వి.రాబర్ట్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు తీసుకు రావాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20, 21 తేదీల్లో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వివరాలకు సెల్ 9676095979 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

20న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో ఈ నెల 20వ తేదీన అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగు పోటీలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. గ్రామంలోని యాగంటీశ్వరస్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు,రూ.30 వేలు,రూ.20 వేలు,రూ.15 వేల చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామని ప్రకటించారు. ఆసక్తి గల యజమానులు అదే రోజు ఉదయం 7 గంటల లోపు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు సెల్ 9701338439, 9963628175 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎస్‌ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, సలీమ్

కర్నూలు సిటీ: రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం (ఎస్‌ఎల్‌టీఏ) జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం నగరంలోని ఓ జూనియర్ కాలేజీలో ఆ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్‌ఎల్‌టీఏ జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా జి.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సలీమ్, అదనపు కార్యదర్శిగా మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా సురేష్‌కుమార్, కె.రామాంజనేయులు, ఆర్థిక కార్యదర్శిగా అయ్యన్న, గౌరవ అధ్యక్షుడిగా యోగేశ్వరరెడ్డి, గౌరవ సలహాదారులుగా తాహెర్ హుసేన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఇటీవలే మరణించిన ఆ సంఘం నాయకులు డా.జయరామ్‌కు నివాళి అర్పించారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జంగమ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక


కల్లుమఠం ఉత్తరాధికారి గురుసిద్ధ మహాస్వాములతో ఎన్నికైన సభ్యులు

ఆదోనిఅర్బన్: జంగమ సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదోనిలో కల్లుమఠంలో కల్లుమఠం ఉత్తరాధికారి గురుసిద్ధ మహాస్వాముల సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా గౌరవాధ్యక్షులుగా కర్నూలు గంగాధరయ్యస్వామి, జిల్లా అధ్యక్షులుగా ఆదోని ఎర్రిస్వామి, ఉపాధ్యక్షులుగా తంగరడోణ పరమేశ్వరస్వామి, వెల్దుర్తి చాముండేశ్వరి, కోసిగి మహంతేష్‌స్వామి, ప్రధాన కార్యదర్శిగా కుంటనహాల్ మంజునాథస్వామి, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా కర్నూలు కోటేశ్వరయ్య, జాయింట్ సెక్రటరీగా ఆదోని ఆదిబసవయ్యస్వామి, సహాయ కార్యదర్శిగా ఎమ్మిగనూరు గురుశాంతయ్యస్వామి, కోశాధికారిగా ఆదోని వీరేష్‌స్వామిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ జంగమలంతా ఐకమత్యంతో ఉండాలన్నారు. అతి త్వరలోనే జంగమ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆదోని డివిజన్ జంగమ సమాజ సేవా సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్‌స్వామి, సభ్యులు వీరేష్‌స్వామి, చంద్రశేఖర్‌స్వామి, లోకేష్‌స్వామి, మదిరి వీరేష్ పాల్గొన్నారు.

వైద్య రంగంలో సమూల మార్పులు

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి


ఇంతియాజ్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం సభ్యులు

కర్నూలు (టౌన్): వైద్య రంగంలో సమూల మార్పులు వచ్చాయని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలిచి పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య. కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ అన్నారు. ఆదివారం స్థానిక బీఎస్ కళ్యాణ మండపంలో వైఎస్‌ఆర్‌సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జ్ హరికృష్ణరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అభ్యర్థులు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైద్య రంగానికి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఒక్క కర్నూలులోనే రూ.550 కోట్లతో ఆసుపత్రుల అభివృద్ధి చేశారన్నారు. డయాగ్నోస్టిక్ సెంటర్, క్యాన్సర్ ఆసుపత్రి, నంద్యాల, ఆదోని వైద్య కళాశాలలు, ఆసుపత్రుల్లో పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టిన ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు. ఆరోగ్యశ్రీ పేరుతో రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం దేశంలోనే ఎక్కడా లేదన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ కోడుమూరు సమన్వయకర్త ఆదిమూలపు సతీష్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

నంద్యాల మెయిన్ బ్రాంచ్-803791 డి.నం: 3-282, కర్నూల్, బైరామల్ స్ట్రీట్, నంద్యాల-518501. ఫోన్ నం. 08514-248925, ఇమెయిల్: ubin0803791@unionbankofindia.bank

స్వాధీనతా ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లో (రూల్ -8 (1)) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (యాక్ట్ 2002 యొక్క 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ ప్రస్తుత యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పూర్వపు ఆంధ్రాబ్యాంక్ వారి అధీకృత అధికారి అయిన క్రింది సంతకముదారు తేది: 10.01.2024లో జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారము దరఖాస్తుదారు: శ్రీ షేక్ ఖలీల్ అహ్మద్ తండ్రి ఎస్.ఎ. గఫూర్, డి.నం. 10-999, గద్దా స్ట్రీట్, పాత బస్టాండ్ దగ్గర, కోయిలకుంట్ల, నంద్యాల జిల్లా-518134, కో-ఆబ్లిగెంట్ : శ్రీ గోవిరెడ్డి సుధీర్ రెడ్డి, తండ్రి జి. సూర్యనారాయణ రెడ్డి, డి.నం. 10-360/4, జూనియర్ కాంప్లెక్స్, ఆటోనగర్, కోయిలకుంట్ల, నంద్యాల జిల్లా-518134. వారిని నోటీసులో తెలిపిన మొత్తం రూ. 16,04,565.00 (రూపాయలు పదహారు లక్షల నాలుగు వేల ఐదు వందల అరవై ఐదు మాత్రమే)ను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది.

సదరు రుణగ్రహీతలు బకాయి మొత్తమును చెల్లించుటలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8తో చదవబడు సదరు చట్టములోని సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకొనుచూ క్రింద తెలిపిన ఆస్తిని ఈ క్రింది సంతకముదారు తేది: 15.03.2024న స్వాధీనం చేసుకోవడమైనదని రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

కావున ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకమునకు హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనియు, ఒకవేళ జరిపినట్లయితే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రావలసిన బకాయి మొత్తము తేది: 09.01.2024 నాటికి రూ. 16,04,565.00 (రూపాయలు పదహారు లక్షల నాలుగు వేల ఐదు వందల అరవై ఐదు మాత్రమే) ప్లస్ వడ్డీ మరియు ఇతర ఛార్జీలు ఇదనము క్రింద వర్తింపను. సెక్యూర్డ్ అస్తులను విడిపించుకొనుటకు రుణగ్రహీతకు లభించే సమయానికి సంబంధించి సదరు చట్టములోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతను కోరడమైనది.

సెక్యూర్డ్ అస్తుల వివరాలు:

కర్నూలు జిల్లా, నంద్యాల రిజిస్ట్రేషన్ జిల్లా, కోయిలకుంట్ల ఉప రిజిస్ట్రేషన్ జిల్లా, మరియు కోయిలకుంట్ల మండలం, కోయిలకుంట్ల గ్రామం మరియు గ్రామపంచాయతీ పరిధిలో గల గృహము యావదాస్తి. మరియు వివరములు : సర్వే నం. 413 పైకి ఇ.నం. 10-999. విస్తీర్ణము: 130.22 చ.గ.లు. సరిహద్దులు: తూర్పు: రస్తా, పడమర: సుందర్ రావు గృహము, ఉత్తరం: ఈడిగ రామయ్య గృహము, దక్షిణం: కడివిల్ల ఫరీదా ఫర్జర్ బీబీ గృహము.

తేది: 15.03.2024, ప్రదేశము: నంద్యాల

సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

MARRIAGE SERVICES

■ బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ, ప్రైవేట్, టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, ఆర్మీ, డాక్టర్ సంబంధాలు కలవు. (2వ సంబంధాలు కలవు). స్టార్ మ్యారేజ్ బ్యూరో, నంద్యాల. సం.ప్ర: 8790844959. [L-806444]

FOR SALE

■ Vehicle for Sale: Sezing Car For Sale Indusind Bank నందు Hyundai Xcent Model 2018 Regd no TS-08-JM-3460 కారు అమ్మకానికి కలదు. సెల్: 93840 65287. [L-806451]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-6430]

శివశక్తి జ్యోతిష్యాలయం

■ ఉచిత జ్యోతిష్యం. ఉద్యోగం, వ్యాపారం, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, వశీకరణం. ఇంకా ఎటువంటి సమస్యలున్న 3 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపబడును. సెల్ : 76767 03640. [A-784591]

WANTED

■ కారు డ్రైవర్ కావలెను: కర్నూలు నగరంలో స్కార్పియో వాహనం నడుపుటకు అనుభవం గల కారు డ్రైవర్ కావలెను. సంప్రదించండి: ఫోన్: 73309 24873, 98854 85281. [L-806439]

■ ప్రముఖ బ్యాంకింగ్ రంగంలో పర్మినెంట్ జాబ్ అవకాశం. టెలికాలర్స్ కావలెను. నో టార్గెట్స్ & ఏజ్ లిమిట్, మంచి జీతం+ఇన్సెంటివ్స్. సం.ప్ర: కర్నూలు. సెల్: 93914 92449. [L-822452]

■ కర్నూలు విజయడైరీలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్ మరియు గార్డ్స్ కావలెను. జీతం: 11,000/- నుండి 13,000/-, అర్హత: 7th-డిగ్రీ, డ్యూటీ: 8గం॥లు. ఫోన్: 95817 76924, 96524 47856. [L-822457]

■ బనగానపల్లె, నెహ్రూ రెసిడెన్షియల్ హైస్కూల్‌లో పనిచేయుటకు వార్డెన్లు, సెక్యూరిటీ గార్డ్స్, ఆయాలు, వంట మనుషులు కావలెను. ఫోన్: 94402 32715, 95501 31444. [L-822454]

■ కర్నూలు సిటీలో గల ప్రముఖ వెహికల్ షోరూంస్, హాస్పిటల్స్, అపార్ట్‌మెంట్స్, స్కూల్స్ మరియు రెస్టారెంట్స్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ బాయ్స్ వెంటనే కావలెను. ఫోన్: 83419 57788. [L-822453]

■ AP TS NEWS APP JOBS SERVICES: విలేకరులు, ఫిమేల్ టెలికాలర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్లు, కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. సెల్: 99666 76646. [L-806449]

■ ఎమ్మిగనూరులోని ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. డ్యూటీ: 8గంటలు, జీతం: 8వేలు+ESI, PF, వయసు 18 నుండి 40సం॥. సంప్రదించండి: 93907 39884. [L-806450]

■ కర్నూలులో గల విమానం రెస్టారెంట్‌లో పనిచేయుటకు కెప్టెన్స్ (జెంట్స్-15), జీతం: 16వేలు & లేడీ స్టీవర్డ్-45, జీతం: 13వేలు కావలెను. అర్హత: ఇంటర్ ఆపైన, రూం+భోజనం కలదు. హోటల్ మేనేజ్‌మెంట్ వారికి ప్రాముఖ్యత. కనీసం 6 నెలలు EXP. ఫోన్: 96180 87999, 95817 76925. [L-822463]

■ కష్టపడి కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం, HYD. ఫోన్: +91 7995984445 [HA-96889]

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులకు, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 20k ఫోన్: 8977639662 / 8977639663 [H-799855]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సీఏఏతో ముస్లింల హక్కులు నిర్వీర్యం

సీఏఏ అమలుకు చంద్రబాబు వత్తాసు పలకడం నీచరాజకీయం: ఎమ్మెల్సీ ఇసాక్ బాషా


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(సిటీ): సీఏఏ (సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్) అమలు చేస్తూ ముస్లింల హక్కులు నిర్వీర్యం చేయడానికి బీజేపీ ప్రభుత్వం చూస్తోందని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆఫ్గనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ లలో వేధింపులకు లోనవుతూ మన దేశానికి వలస వచ్చిన హిందూ, సిక్కు, జైన, బౌద్ధ, క్రైస్తవ, పార్సీ మతస్తులకు త్వరితగతిన పౌరసత్వం ఇవ్వడం సీఏఏ ప్రధాన ఉద్దేశమన్నారు. పార్లమెంటులో 2019లో బిల్లు పెట్టి ఆమోదించుకున్న కేంద్ర ప్రభుత్వం ఈ మతస్తులు ఐదేళ్లపాటు వరుసగా మన దేశంలో నివసిస్తే పౌరసత్వానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించిందన్నారు. శ్రీలంకలోని మైనారిటీలైన హిందూ తమిళులు, మయన్మార్‌లోని రోహింగ్యాలను, హజరా, అహ్మదీయ వంటి ముస్లిం తెగలను ఈ సీఏఏ పరిధిలోకి తీసుకోలేదన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని మన రాజ్యాంగం చెబుతున్నా పౌరులందరికీ సమాన రక్షణ కల్పించాలని రాజ్యాంగంలోని 14వ అధికరణ చాటుతోందన్నారు. కేవలం ఎన్నికలు సమీపిస్తుండడంతో బీజేపీ ఈ వైఖరిని తెరపైకి తెచ్చి ప్రజలను సెంటిమెంట్‌తో ప్రలోభ పెడుతోందన్నారు. గత ఎన్నికల్లో కూడా పుల్వామా దాడులు, సర్జికల్ స్ట్రైక్స్‌ను ఎన్నికలకు ప్రచారాస్త్రంగా చేసుకుని బీజేపీ రాజకీయ లబ్ధి పొందిందని గుర్తుచేశారు. మన రాష్ట్రంలో దుష్టచతుష్టయమైన పవన్, చంద్రబాబు గ్యాంగ్ కూడా సీఏఏకు వత్తాసు పలుకుతున్నారన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ పార్టీ గతంలోనే ఈ సీఏఏ బిల్లును ముస్లిం లా పర్సనల్ బోర్డు సూచనలు పాటించి మార్పులు, చేర్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిందన్నారు. ముస్లింల హితవు కోసం దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి రిజర్వేషన్లు, పదవుల్లో వారికి ఇచ్చిన ప్రాముఖ్యతను నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ముస్లింలకు కీలక పదవులను ఇవ్వడమే కాకుండా సార్వత్రిక ఎన్నికల్లో 7 మందికి ఎమ్మెల్యే స్థానాలను ఇచ్చారన్నారు. అంతే కాకుండా మొత్తం స్థానాల్లో 50శాతం పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీట్లను కేటాయించిన ఏకైక నాయకుడన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, కౌన్సిలర్లు ఆరిఫ్‌నాయక్, సాదిక్, కలాం బాష, అబ్దుల్ సమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ బలగాల కవాతు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో వెల్దుర్తి పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాలలో సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. పట్టణంలోని పురవీధులలోను, రామళ్లకోట, బొమ్మిరెడ్డిపల్లె, ఫ్యాక్షన్ గ్రామాలైన అల్లుగుండు, మల్లెపల్లె, చెరుకులపాడు గ్రామాలలో ఏడు కేంద్ర సాయుధ బలగాలలో ఒకటైన భారత దేశ సరిహద్దు (నేపాల్, భూటాన్) రక్షణ దళం 'సహస్త్ర సీమా బల్ – ఎస్‌ఎస్‌బీ' బలగాలు తమ కవాతుతో ప్రజలకు భరోసా కల్పించాయి. ఎన్నికలలో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటర్లలో ఆత్మస్థైర్యం నింపడమే కవాతు ముఖ్య ఉద్దేశమని సీఐ, ఎస్‌ఐ తెలిపారు. ఎన్నికల సమయంలో ఏ చిన్న గొడవ జరిగినా అక్కడికక్కడే సాయుధ దళాలతో గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు.


వెల్దుర్తి మండలంలో ఎస్‌ఎస్‌బీ దళాల కవాతు